

జిల్లా కేంద్రంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న పోలింగ్ సిబ్బంది

# పోలింగ్‌కు వేళాయె..

- ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు



ఖలీల్‌వాడి, నవంబర్ 29: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, సీఎస్ఐ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా అర్బన్, రూరల్ నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు 144 సెక్షన్ విధించారు.

**ఆరు నియోజకవర్గాలు..1549 పోలింగ్ కేంద్రాలు**

జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలకు 1549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌లో 217 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 2,063,44 మంది ఓటర్లు, బోధన్‌లో 246 పోలింగ్ బూత్‌లు ఉండగా.. 2,15,963 మంది, బాన్సువాడలో 258 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 1,92,841 మంది ఓటర్లు ఉన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో 289 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 2,86,766 మంది ఓటర్లు, నిజామాబాద్ రూరల్‌లో 293 పోలింగ్ బూత్‌లకు 2,48,269 మంది, బాల్కొండలో 246 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,15,628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మొత్తం పురుషులు 6,47149 మంది, మహిళలు 7,18,603 మంది, ట్రాన్స్‌జెండర్లు 59 మంది ఉన్నారు.

**ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ సిబ్బంది తరలింపు**

పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించడానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందజేసిన ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ , నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, బాల్కొండ సెగ్మెంట్ల పరిధిలోని 833 ప్రాంతాల్లో మొత్తం 1549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1864 మంది పీవోలు, 1867 మంది ఏపీవోలు, వోపీవోలు 3727 మంది కలుపుకొని మొత్తం 7458 మందిని పోలింగ్ విధుల కోసం కేటాయించారు.



బస్సులో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది



సందేహాలను నివృత్తి చేసుకుంటున్న సిబ్బంది



జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 29 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు బుధవారం సందర్శించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించి పిప్రి రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాల్కొండ సెగ్మెంట్‌కు సంబంధించి భీమ్‌గల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎం.సుబ్రా చక్రవర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి లోటుపాట్లు గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్వోలకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని బడా భీమ్‌గల్, చేంగల్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటివసతి, వీల్‌చైర్స్ తదితర సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అమర్చిన సీసీ కెమెరాలను,మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద చేసిన ప్రత్యేక ఏర్పాట్లను కలెక్టర్ గమనించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

